www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 14 నవంబర్ 2025

5

పశ్చిమ గోదావరి

జిల్లాలో నడవనున్న 'వందే భారత్'

ప్రజాశక్తి - నరసాపురం

జిల్లాలో మొట్ట మొదటిగా వందే భారత్ రైలు నడవనుంది. డాక్టర్ ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ నుంచి విజయవాడ వరకు వెళ్లే వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును జనవరి 12వ తేదీ నుంచి నరసాపురం వరకు పొడిగిస్తున్నట్లు దక్షిణ రైల్వే అధికారులు తెలిపారు. ట్రెయిన్ నె. 20677 రైలు చెన్నై నుండి జనవరి 12న 5.30 బయలుదేరి 14.10కి నరసాపురం చేరుతుంది. తిరిగి అదే రోజు ట్రెయిన్ నెం. 20678 రైలు నరసాపురంలో 14.50 బయలుదేరి 23.45కు చెన్నై చేరుతుంది. జిల్లాలో ఈ రైలు భీమవరం టౌన్, నరసాపురం స్టేషన్లో ఆగుతుంది. రాష్టంలో రేణిగుంట, నెల్లూరు, ఒంగోలు, తెనాలి, విజయవాడ, గుడివాడలో ఈ రైలు ఆగుతుంది.

'కొల్లేరును ఆనుకుని ఉన్న గ్రామాల్లో వ్యవసాయ సాగు చేసుకుంటున్న రైతులను బతకనివ్వండి. పర్యావరణానికి ఎటువంటి ఇబ్బందీ లేకుండా వరిసాగు చేస్తున్న రైతులపై ఎందుకింత కక్ష.. భూముల్లోకి వెళ్లకుండా అటవీశాఖ అధికారులు పెడుతున్న ఇబ్బందులను తొలగించండి. ఆ భూములపై వేలాది కుటుంబాలు ఆధారపడి బతుకుతున్నాయి. సాగు నిలిపివేస్తే రైతులంతా రోడ్డున పడే పరిస్థితి వస్తోంది. కొల్లేరుకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా దశాబ్దాల తరబడి వరి సాగు చేస్తున్నాం. ఇప్పుడెందుకు ఈ రాద్ధాంతం.' అంటూ ఉంగుటూరు నియోజకవర్గంలోని కొల్లేరు గ్రామాల రైతులు కన్నెర్ర జేశారు. గురువారం కలెక్టరేట్ వద్ద ఆందోళనకు దిగడం సంచలనం రేపింది. ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు రైతులను తీసుకుని జిల్లా ఉన్నతాధికారులను కలిసి సమస్యను విన్నవించి రైతులకు న్యాయం చేయాలని కోరారు.

- రోడ్డెక్కిన కొల్లేరును ఆనుకుని ఉన్న గ్రామాల రైతులు
- వరి సాగుకు అటవీశాఖ అధికారుల ఇబ్బందులపై కన్నెర్ర
- వేల మంది సన్న, చిన్నకారు రైతులకు ఈ భూములే ఆధారం
- కలెక్టరేట్‌కు తరలొచ్చిన ఉంగుటూరు నియోజకవర్గంలోని వేల మంది రైతులు
- ఉన్నతాధికారుల వద్దకు రైతులను తీసుకెళ్లిన ఎంఎల్ఎ ధర్మరాజు

దాళ్వా సాగుపై.. హైరానా..!

కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఉంగుటూరు, దెందులూరు, కైకలూరు, ఉండి నియోజకవర్గాల పరిధిలో కొల్లేరు ప్రాంతం విస్తరించి ఉంది. కొల్లేరును ఆనుకుని ఉన్న గ్రామాలకు సంబంధించి ఐదో కాంటూరు పరిధిలో వేలాది ఎకరాల పట్టా భూములు, అన్‌సర్వే భూములు ఉన్నాయి. ఈ భూముల్లో దశాబ్దాల తరబడి ఆయా గ్రామాల రైతులు వరిసాగు చేసుకుంటున్నారు. ప్రకృతితో మమేకమై పక్షులతో కలిసిపోయి ఇక్కడి రైతులు ముందుకు సాగుతుంటారు. కొల్లేరు పల్లపు ప్రాంతం కావడంతో ఏడాదికి ఒక్కసారి దాళ్వాలో మాత్రమే రైతులు పంటను సాగు చేస్తారు. వర్షాకాలంలో కొల్లేరుకు వరద ఎక్కువ రావడం కారణంగా ఖరీఫ్ సాగు చేయడం సాధ్యం కాదు. అన్‌సర్వే భూములన్నీ గ్రామాల్లో చిన్న, సన్నకారు రైతులవే. ఏడాదికి వచ్చే ఒక్క పంటే ఆయా కుటుంబాలకు ఆధారం. ఆ పంట కోసం ఏడాదంతా ఎదురుచూస్తుంటారు. ముఖ్యంగా ఉంగుటూరు నియోజకవర్గంలోని నిడమర్రు, ఉంగుటూరు, భీమడోలు మండలాల్లో అత్యధిక మంది రైతులు కొల్లేరును ఆనుకుని ఉన్న పొలాల్లో వరిసాగు చేస్తుంటారు. నిడమర్రు మండలంలో పట్టాభూమి కాకుండా అన్‌సర్వే భూమి దాదాపు రెండు వేల ఎకరాలకు పైగా ఉంది. ఉంగుటూరు, భీమడోలు మండలంలోనూ అంతేస్థాయిలో కొల్లేరును ఆనుకుని ఉన్న అన్‌సర్వే భూములను రైతులు వందల సంవత్సరాల నుంచి సాగు చేసుకుంటున్నారు. దెందులూరు నియోజకవర్గంలోనూ పలు గ్రామాల రైతులు కొల్లేరులోని అన్‌సర్వే భూముల్లో వరిసాగు చేస్తున్న పరిస్థితి ఉంది. ఇటీవల కాలంలో అటవీశాఖ అధికారులు రైతులను తీవ్రంగా వేధిస్తున్న పరిస్థితి నెలకొంది. కొల్లేరులోని అన్‌సర్వే భూముల్లో వరిసాగు చేయడానికి వీల్లేదంటూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. దాళ్వా సాగుకు రైతులు సన్నద్ధమై పొలాల్లోకి పనులు చేసుకోవడానికి వెళ్తుంటే అటవీ శాఖ అధికారులు అడ్డుకుంటున్న పరిస్థితి. వర్షాల సమయంలో వరద ముంపును తప్పించడానికి పెదనిండ్రకొలను పరిధిలోని పందికోడుకు గండుకొట్టిన పరిస్థితి ఉంది. గండిని పూడిస్తే తప్ప పెదనిండ్రకొలను పరిధిలోని అన్‌సర్వే భూములతోపాటు, పట్టా భూముల్లోనూ వరిసాగు చేసేందుకు వీల్లేని పరిస్థితి. అటవీశాఖ అధికారులు పందికోడు గండిని పూడ్చనివ్వకుండా అడ్డుపడుతున్నారని రైతులు చెబుతున్నారు. దీంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. గురువారం ఏలూరు కలెక్టరేట్‌లో రాష్ట్ర అటవీశాఖ చీఫ్ ప్రిన్సిపల్ కన్జర్వేటర్ డాక్టర్ పి.వి.చలపతిరావు ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల కలెక్టర్లతో సమావేశం నిర్వహిస్తున్నారని తెలిసి వేలాది మంది రైతులు కలెక్టరేట్‌కు తరలివచ్చారు. ఉంగుటూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన వేల మంది రైతులు తరలిరావడంతో ఏలూరు కలెక్టరేట్ ధర్నా సెంటర్ కిక్కిరిసిపోయింది. వ్యవసాయ సాగుకు ఇబ్బంది లేకుండా చూడాలంటూ రైతులు పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు గ్రామాల వారీగా రైతులను ఎంపిక చేసి అధికారుల వద్దకు తీసుకెళ్లి వినతిపత్రాలు ఇప్పించారు. రైతులకు వరిసాగుకు ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులను కోరారు. సిఎం, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ వద్దకు సమస్యను తీసుకెళ్తానని ఎంఎల్ఎ తెలిపారు.

వ్యవసాయం ఆపేస్తే రైతులు అన్యాయమైపోతారు..

కందులపాటి సత్యనారాయణ, పెదనిండ్రకొలను సహకార సంఘం అధ్యక్షులు

పెదనిండ్రకొలనులో కొల్లేరును ఆనుకుని అన్‌సర్వే భూములతోపాటు, పట్టాభూములు రెండు వేల ఎకరాలకు పైగా ఉన్నాయి. సన్న, చిన్నకారు రైతులే ఈ భూములను సాగుచేసుకుంటున్నారు. ఇప్పుడు సాగు నిలుపుదల చేస్తే రైతులు తీవ్రంగా నష్టపోతారు. రైతులకు వరిసాగు చేసుకునేందుకు ఇబ్బంది లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

130 కుటుంబాలు రోడ్డున పడతాయి..

గొర్రెల సాంబశివరావు, అప్పారావుపేట, ఉంగుటూరు మండలం

'మా గ్రామంలో కొల్లేరును ఆనుకుని అన్‌సర్వే భూమి 110 ఎకరాలు ఉంది. 130 కుటుంబాలు ఈ భూములను కలిసి సాగుచేసుకుంటున్నాయి. ఆ భూముల్లోకి అటవీశాఖ అధికారులు రావొద్దంటున్నారు. వరిసాగు చేయడానికి ఇబ్బందులేంటో అర్థంకావడం లేదు. సాగుచేయపోతే 130 కుటుంబాలు రోడ్డున పడతాయి.

మా కుటుంబానికి ఈ భూములే ఆధారం..

కుక్కల రామలక్ష్మి, దేవరగోపవరం, నిడమర్రు మండలం

మా కుటుంబానికి నాలుగెకరాల భూమి ఉంది. ఆ భూమి మీదే ఆధార పడి జీవిస్తున్నాం. ఆ భూముల్లో వరి సాగు చేయడానికి వీల్లే దంటూ చెబుతున్న మాటలతో ఆందోళన కలుగుతోంది. సాగుకు ఇబ్బంది లేకుండా చేయాలని అధికారులను కోరుతున్నాం.'

80 శాతం ఎస్‌సి, బిసి, మైనార్టీ రైతులే ఉన్నాం

చోడగరి వెంకట కృష్ణ, డి.గోపవరం

మా గ్రామంలో 250 ఎకరాల అన్‌సర్వే భూమి ఉంది. 160 మంది ఎస్‌సి, బిసి, మైనార్టీ రైతులే ఈ భూములను సాగు చేసుకుంటున్నాం. ఈ భూముల్లో సాగు నిలుపుదల చేస్తే ఆయా కుటుంబాలన్నీ రోడ్డున పడతాయి. సాగుకు ఇబ్బంది లేకుండా చూడాలి.

సాగు నిలుపుదల చేస్తే ఆర్థికంగా దెబ్బతింటాం

నిమ్మల ఏసుబాబు, అడవికొలను రైతు

మా కుటుంబానికి ఎనిమిదెకరాల అన్‌సర్వే భూమి ఉంది. ఆ భూమే మాకు ఆధారం. ఇప్పుడు సాగు చేయకుడదని చెబితే ఆర్థికంగా దెబ్బతినే పరిస్థితి ఉంటుంది. సాగుకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరుతున్నాం.

ప్రజల భద్రతే ధ్యేయంగా ట్రాఫిక్ నియంత్రణ

సీసీ కెమెరాలు, సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటు చేయాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

మాటాడతున్న కలెక్టర్ నాగరాణి

జిల్లాలో ప్రజల భద్రతే ధ్యేయంగా ట్రాఫిక్ నియంత్రణ ఉండాలని ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే ఉపేక్షించొద్దని జిల్లా కలెక్టర్ చదరవాడ నాగరాణి ఆదేశించారు. కలెక్టరేట్లో గురువారం జిల్లా కలెక్టర్ నాగరాణి, జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి సంయుక్తంగా జిల్లాలో ట్రాఫిక్ నియంత్రణ, చేపట్టాల్సిన చర్యలు, ఆక్రమణల తొలగింపు, ఐరాడ్ వెబ్‌సైట్‌లో యాక్సిడెంట్ డెత్ కేసులు నమోదు, తదితర అంశాలపై పోలీస్, రెవెన్యూ, ఆర్అండ్‌బి, ఎన్‌హెచ్, రవాణా శాఖల అధికారులతో సమీక్షించారు. భీమవరంలోని ట్రాఫిక్ రద్దీ ప్రాంతాలు, తీసుకోవాల్సిన చర్యలపై భీమవరం డిఎస్‌పి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ప్రజల ప్రాణాలు ఎంతో విలువైనవని, ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు చేపట్టాల్సిన చర్యల్లో ఎట్టి పరిస్థితుల్లో రాజీ పడొద్దని ఆదేశించారు. భీమవరంలో నిర్మాణంలో ఉన్న మూడు రోడ్లను డిసెంబర్ 15 నాటికి కచ్చితంగా పూర్తిచేసి అందుబాటులో తీసుకురావాలని ఆదేశించారు. రోడ్డుకు ఇరుపక్కలా హాకర్స్ తోపుడు బండ్లకు భీమవరం పట్టణంలోని ఒక ప్రాంతాన్ని చూపించి అన్నీ ఒక చోట ఉండి వ్యాపారం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. భీమవరంలో నానాటికీ పెరుగుతున్న రద్దీ, ఇరుకైన మార్గాల కారణంగా తరచూ ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుందని, వాహనదారులు కూడా ట్రాఫిక్ నియమ, నిబంధనలను తప్పకుండా పాటించాలన్నారు. పట్టణంలో టూటౌన్, త్రిటౌన్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని, వన్ టౌన్‌లో సీసీ కెమెరాల ఏర్పాటును ప్రారంభించాల్సి ఉందని పేర్కొన్నారు. ట్రక్ డ్రైవర్లు రాష్ డ్రైవింగ్‌తో కనిపిస్తే పోలీస్, రవాణా శాఖ అధికారులే జవాబుదారులన్నారు. రోడ్డు యాక్సిడెంట్లు కారణంగా మరణించిన వివరాలను ఎప్పటికప్పుడు ఐరాడ్ వెబ్‌సైట్లో అప్‌డేట్ చేయాలన్నారు. పెండింగ్ డేటాను వెంటనే అప్డేట్ చేసి నివేదిక సమర్పించాలన్నారు. జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి జిల్లాలో జనవరి నుండి నవంబర్ వరకూ జరిగిన రోడ్డు యాక్సిడెంట్లు, తదితర వివరాలను వివరించారు. భీమవరం నియోజకవర్గ డిఎస్‌పి ఆర్.జయసూర్య, తాడేపల్లిగూడెం డివిజన్ డిఎస్‌పి డి.విశ్వనాథ్, మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, బిఆర్అండ్‌బి ఎస్ఇ శ్రీనివాసరావు, జిల్లా రవాణా శాఖ అధికారి ఎస్ఎండి కృష్ణారావు, 216 నేషనల్ హైవే పీడీ బి.శ్రీనివాస్, ఆర్అండ్‌బి 165 హైవే డిఇ ఎన్.శ్రీనివాసరావు పాల్గొన్నారు

ఎస్ఐఆర్‌ను నిలుపుదల చేయాలి

ఢిల్లీ బాంబ్ బ్లాస్ట్ దోషులను కఠినంగా శిక్షించాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.బలరాం

అధ్వానంగా ఉన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి : సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

ప్రజాశక్తి - భీమవరం

మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బలరాం

కేంద్ర ప్రభుత్వం ఓటర్ల సమ పరిశీలన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) పేరుతో ఒక మతాన్ని టార్గెట్ చేసి ఓట్లు తొలగించే చర్య చేపట్టిందని, దీన్ని రాష్ట్రంలో అమలు చేయాలని చూస్తోందని, తక్షణం నిలుపుదల చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.బలరాం డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్ అమలుకు బీహార్ రాష్ట్రాన్ని ఒక నమూనాగా తీసుకున్నారని, తర్వాత 12 రాష్ట్రాల్లో అమలు చేస్తామని ఇటీవల ప్రకటించారని, అయితే ఆ జాబితాలో మన రాష్ట్రం లేకపోయినప్పటికీ రాజకీయ పార్టీలకు చెప్పకుండానే ఎస్ఐఆర్ ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారని విమర్శించారు. స్థానిక మెంటేవారితోటలోని సుందరయ్య భవనంలో సిపిఎం జిల్లా విస్తృతస్థాయి సమావేశం నాయకులు కేతా గోపాలన్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.బలరాం, రాష్ట్ర కమిటీ సభ్యులు మంతెన సీతారాం హాజరయ్యారు. దేశ రాజధాని ఢిల్లీలో బాంబు బ్లాస్టులో మృతి చెందిన వారికి సంతాపం తెలిపి నివాళులర్పించి వారి కుటుంబాలకు సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ ఢిల్లీ ఘటన దోషులను పట్టుకొని కఠినంగా శిక్షించాలన్నారు. భవిష్యత్‌లో ఇటువంటివి జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉగ్రవాదాన్ని నిర్మూలించడంలో ఇంటిలిజెన్సీ, రాజకీయ వైఫల్యం ఉందన్నారు. పుల్వామా, పెహల్గాంతోపాటు అనేక చోట్ల ఉగ్రవాదదాడులు జరిగాయని వాటిని గుర్తించడంలోనూ, ప్రజలప్రాణాలు కాపాడడంలోను కేంద్రం పూర్తిగా నిర్లక్ష్యంగా ఉందన్నారు. ఉగ్రవాదాన్ని అంతమొందించామంటూ బిజెపి ప్రచారం చేసుకుంటోంది తప్ప వాస్తవంగా అణచివేయలేదన్నారు. ఇటీవల మొంథా తుపానుల వల్ల రైతాంగం, ఆక్వా రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. నష్టాన్ని అంచనా వేసి రైతులకు పూర్తిగా నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలన్నారు. ధాన్యానికి మద్దతు ధరతోపాటు కేరళ, తమిళనాడు రాష్ట్రాలు ఇస్తున్నట్లుగా రూ.500 బోనస్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ జిల్లాలో రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయన్నారు. వెంటనే రోడ్ల మరమ్మతులు చేపట్టి, కొత్త రోడ్ల నిర్మాణం చేయాలన్నారు. టిడ్కో గృహాల వద్ద తాగునీరు, డ్రెయినేజీ, విద్యుత్, రోడ్డు మార్గం సదుపాయాల్లేక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కౌరు పెద్దిరాజు, బి.వాసుదేవరావు, కర్రి నాగేశ్వరరావు, పివి.ప్రతాప్, జిల్లా కమిటీ సభ్యులు, మండల కార్యదర్శులు, కన్వీనర్లు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలల దినోత్సవం రోజు పరీక్షల నిర్వహణ సరికాదు

పరీక్షను రద్దుచేసి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలి

డిఇఒ కార్యాలయ సూపరింటెండెంట్ తిరుపతిరాజుకు ఎస్ఎఫ్ఐ వినతి

భీమవరం : డిఇఒ కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

ప్రజాశక్తి - భీమవరం

బాలల దినోత్సవం రోజు పరీక్ష నిర్వహించడం అంటే వారి హక్కులను హరించడమే అని, ఇది సరి కాదని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ కార్యదర్శి టి.ప్రసాద్ అన్నారు. బాలల దినోత్సవం రోజే పరీక్షలు నిర్వహించాలని ఇచ్చిన ఆదేశాలను నిరసిస్తూ కలెక్టరేట్లో డిఇఒ కార్యాలయ సూపరింటెండెంట్ ఎం.తిరుపతిరాజుకు ఎస్ఎఫ్ఐ నేతలు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ బాలల దినోత్సవం పిల్లల హక్కులను కాపాడుతూ, వారి సృజనాత్మకతను, చైతన్యాన్ని గుర్తించే రోజన్నారు. దేశవ్యాప్తంగా పిల్లల్లో సామాజిక అవగాహన, సృజనాత్మకత, సాంస్కృతిక వ్యక్తీకరణను ప్రోత్సహించే అనేక కార్యక్రమాలు బాలల దినోత్సవం రోజున నిర్వహించడం ఆనవాయితీగా జరుగుతోందన్నారు. అయితే ఇదేరోజు పాఠశాలల్లో ఎస్ఎ 1 పరీక్షలు నిర్వహించడం విచారకరమన్నారు. ప్రభుత్వం ఈ విషయంపై పునరాలోచించి, బాలల దినోత్సవం రోజు పరీక్షను రద్దు చేసి, పాఠశాలల్లో సామూహిక కార్యక్రమాలు, పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.లక్ష్మణరావు, జిల్లా కమిటీ సభ్యులు కమిటీ సభ్యులు పి.సాయి కృష్ణ ఉన్నారు.

తాడేపల్లిగూడెం : బాలల దినోత్సవం రోజు విద్యార్థులకు పరీక్షలు తగవు అని ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు పతివాడ నాగేంద్రబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఎంఇఒ వి.హనుమాన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగేంద్రబాబు మాట్లాడుతూ బాలల దినోత్సవం రోజు పరీక్షలు నిర్వహించడం అంటే వారి హక్కులను హరించడమే అన్నారు. పరీక్షలను వెంటనే వాయిదా వేసి తదుపరి తేదీల్లో నిర్వహించాలని కోరారు. నవంబరు 14 బాలల దినోత్సవం పిల్లల హక్కులను కాపాడుతూ, ఆరోజు అనేక కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీగా జరుగుతోందన్నారు. బాలల దినోత్సవం రోజు పరీక్షలు రద్దు చేసి, పాఠశాలల్లో సామూహిక కార్యక్రమాలు, పోటీలు నిర్వహించేలా సూచనలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు నాగేంద్ర, ఉపాధ్యక్షులు గణేష్, కమిటీ సభ్యులు సంతోష్ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : ఎంఇఒకు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి

జిల్లా ఖజానా అధికారి మహమ్మద్ మజార్ బేగ్

ప్రజాశక్తి - భీమవరం

ఖజానా అధికారిని అభినందిస్తున్న పెన్షనర్స్ సంఘం నేతలు

జిల్లాలోని పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని జిల్లా ఖజానా అధికారి మహ్మద్ మజ్హర్ బేగ్ అన్నారు. ఇటీవల ఖజానాధికారిగా బాధ్యతలు చేపట్టిన ఆయన ఉప ఖజానా కార్యాలయాన్ని గురువారం సందర్శించారు. దీనిలో భాగంగా స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయీస్ జిల్లా అసోసియేషన్ భీమవరం యూనిట్ సభ్యులు మర్యాదపూర్వకంగా ఆయనను కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా బేగ్ మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యల పరిష్కారంలో తాను ముందుంటానని తెలిపారు. ఏ సమస్యనైనా నేరుగా తన దృష్టికి తీసుకురావొచ్చన్నారు. పెన్షనర్ల సమస్యలు పరిష్కరించడంలో ఉన్న ఆనందం మరో దాంట్లో ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో ఉప ఖజానాధికారి అల్లూరి రవివర్మ, పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గాతల జేమ్స్, సాగిరాజు సత్యనారాయణ రాజు, కోశాధికారి రవిప్రసాద్, భీమవరం యూనిట్ కార్యదర్శి పి.సీతారామరాజు, కోశాధికారి పి.సూర్యనారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎ.భాస్కరరావు, జాయింట్ సెక్రటరీలు ఎ.సత్యనారాయణ, ఐ.రామచంద్రరాజు, కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పట్ల ఎంఇఒ నిర్లక్ష్య వైఖరి వీడాలి : యుటిఎఫ్

ఉండి: ఉపాధ్యాయులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సిన మండల విద్యాశాఖాధికారి బి.జ్యోతి ఉపాధ్యాయుల పట్ల నిర్లక్ష్య వైఖరి వహిస్తూ ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని యుటిఎఫ్ మండల అధ్యక్షులు కె.వామనమూర్తి అన్నారు. గురువారం సాయంత్రం ఉపాధ్యాయుల సమస్యలపై ఎంపిడిఒ ఎంవివిఎస్ శ్రీనివాస్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కె.వామనమూర్తి మాట్లాడుతూ మండల విద్యాశాఖ అధికారి బి.జ్యోతి ఉపాధ్యాయులకు అందుబాటులో ఉండరని, ఫోన్ చేసిన అందుబాటులోకి రావట్లేదని, ఉపాధ్యాయుల సమస్యలపై నిర్లక్ష్యంగా ఉంటున్నారని అన్నారు. సింగిల్ టీచర్ ఉన్న పాఠశాలలో ఉపాధ్యాయులు సెలవుపై వెళ్తే ఆ పాఠశాలకు సిఆర్‌పిలను పంపించాలని కానీ సిఆర్‌పిలు మండల కార్యాలయంలోనే ఉంటూ వేరే పాఠశాల నుంచి ఆ పాఠశాలకు ఉపాధ్యాయులను కేటాయిస్తున్నారని ఇది సరికాదన్నారు. ఎంటిఎస్ ఉపాధ్యాయులు సకాలంలో డాక్యుమెంట్లు అందజేస్తున్నప్పటికీ ప్రతినెల జీతాలు సకాలంలో చెల్లించలేదని, ఉపాధ్యాయుల మెడికల్ లీవులు పెడుతుంటే వారికి సెలవులు మంజూరు చేయడంలో జాప్యం చేస్తున్నారన్నారు. సర్వీస్ రికార్డులు ఎప్పటికప్పుడు అప్డేట్ చేయడం లేదని, సర్వీస్ రికార్డుల భద్రత విషయంలో పలు అనుమానాలు ఉన్నాయన్నారు. ఇంక్రిమెంట్ ఆర్డర్లను ఉపాధ్యాయులకు ఇవ్వడం లేదని వారు వాపోయారు. సర్వీస్ లో ఇటీవల కాలంలో చనిపోయిన కె.శామ్యూల్ రాజు అనే ఉపాధ్యాయునికి మెడికల్ లీవ్‌ను ఎప్పటికీ మంజూరు చేయలేదని, దీంతోనే వారి నిర్లక్ష్యం తేటతెల్లమవుతుందన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను ఎంఇఒ దృష్టికి తీసుకువెళ్లిన లేదా ప్రశ్నించిన సదరు ఉపాధ్యాయుని పాఠశాలపై ఉద్దేశపూర్వకంగా దాడులు చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వీటిపై ఎంఇఒ జ్యోతి తక్షణమే స్పందించి వారి వైఖరి మార్చుకోవాలని వినతిపత్రం అందజేస్తుంటే వినతిపత్రం తీసుకోవడానికి ఎంఇఒ జ్యోతి నిరాకరించడంతో ఎంపిడిఒ ఎంవివిఎస్.శ్రీనివాస్‌కు అందజేయగా ఆయన స్పందిస్తూ ఎంఇఒ జ్యోతి తమ ఫోన్లకు కూడా అందుబాటులోకి రావడం లేదని చెప్పడం విశేషం.

చేతి వృత్తిదారుల సమస్యలు ముఖ్యమంత్రి దృష్టికి

కృష్ణబలిజ పూసల సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ త్రిమూర్తులు

భీమవరం టౌన్: చేతివృత్తిదారుల సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్తానని కృష్ణబలిజ పూసల సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ గంటా త్రిమూర్తులు హామీ ఇచ్చారు. గురువారం పశ్చిమగోదావరి జిల్లా చేతివృత్తిదారుల సమాఖ్య ప్రతినిధులు త్రిమూర్తులుని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా త్రిమూర్తులు చేతివృత్తిదారులని ప్రభుత్వం ఆదుకుంటుందని అన్నారు. చేతివృత్తిదారులను కాపాడవలసిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా చేతివృత్తిదారుల సమాఖ్య గౌరవ అధ్యక్షులు ఎం.సీతారాంప్రసాద్, జిల్లా అధ్యక్షులు జేగురు శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి మల్లుల శ్రీనివాసరావు, మత్స్యకార సంఘం జిల్లా నాయకులు మోకా నరసింహాస్వామి, సభ్యులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో మొగల్తూరు సబ్ రిజిస్ట్రార్

ఎసిబి అధికారులమంటూ బురిడీ

రూ.2 లక్షలు ఫోన్ పే : పోలీసులకు ఫిర్యాదు

సైబర్ నేరగాళ్లకు నగదు పంపండంపై ప్రజల్లో చర్చ

ప్రజాశక్తి - మొగల్తూరు



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

మొగల్తూరు సబ్ రిజిస్ట్రార్ సబ్బిత శ్రీనివాసును సైబర్ నేరగాళ్లు ఎసిబి పేరుతో బెదిరించి రెండు లక్షలు కొట్టేశారు. మరో లక్ష రూపాయల కోసం డిమాండ్ చేయటంతో అనుమానం వచ్చిన సబ్ రిజిస్ట్రార్ మొగల్తూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీంతో బెదిరించింది సైబర్ నేరగాళ్లు బురిడీ కొట్టించారని నిర్ధారించుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బుధవారం మధ్యాహ్నం సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌కు విజయవాడ ఎసిబి హెడ్ ఆఫీస్ నుండి అని సైబర్ నేరగాళ్లు ఫోన్ చేశారు. నీ మీద అనేక అవినీతి ఆరోపణలు వస్తున్నాయని మేము రైడ్ చేయకుండా ఉండాలంటే మూడు లక్షలు తమ అకౌంట్లో వేయాలని కాల్ చేశారు. దీంతో శ్రీనివాస్ భయపడి ముందుగా రెండు లక్షలు ఫోన్ పే చేశాడు. ముందుగా తన అకౌంట్ నుండి రూ.లక్ష, తన మిత్రుల అకౌంట్ నుండి రూ.90, 10 వేలు చొప్పున మూడు విడతలుగా రూ.2 లక్షల నగదు పంపాడు. అయినప్పటికీ కేటుగాళ్లు విడిచి పెట్టలేదు. మిగిలిన లక్ష రూపాయలు అకౌంట్లో వేయాలంటే పట్టుపట్టడంతో అనుమానం వచ్చిన సబ్ రిజిస్ట్రార్ మొగల్తూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో బుధవారం మొగల్తూరు ఎస్ఐ వై.నాగలక్ష్మి కేసు నమోదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు బ్యాంక్ అకౌంట్, సెల్ ఫోన్ నెంబర్ ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. అమౌంట్ అనంతపురం ఉరవకొండ ఎస్‌బిఐ బ్రాంచిలో నగదు జమ అయినట్లు సమాచారం. అడిగిన వెంటనే సైబర్ నేరగాళ్లకు సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాస్ నగదు ఎందుకు పంపారు అనేది ప్రశ్నార్థంగా మారింది. తాను ఏ తప్పు చేయకపోతే ఎసిబిని అని చెప్పిన సైబర్ నేరగాళ్లకు నగదు ఎందుకు పంపారు అని ప్రజలు చర్చించుకుంటున్నారు.

సహకార సంఘాల బలోపేతానికి కృషి చేయాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

సహకార సంఘాల బలోపేతానికి సహకార శాఖ అధికారులు విశేష కృషిచేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. 72వ అఖిలభారత సహకార వారోత్సవాలను జిల్లాలో ఈనెల 14 నుండి 20వ తేదీ వరకు నిర్వహించనున్న సందర్భంగా ప్రచార గోడపత్రికను గురువారం కలెక్టరేట్లో ఛీశీఅవగకలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ 72వ అఖిలభారత సహకార వారోత్సవాల్లో భాగంగా సహకార రంగం ప్రాముఖ్యతను, ప్రజాదరణను, కార్యకలాపాలను ప్రజలకు తెలియజేయడం జరుగుతుందన్నారు. వారం రోజులపాటు సహకార శాఖ ఆధ్వర్యాన వివిధ వివిధ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. సహకార సంఘాల నిర్వహణ సామర్థ్యం, జవాబుదారీతనం, పారదర్శకత పెంపొందించుటకై కంప్యూటరీకరణ అమలు చేయాలని సూచించారు. ప్రపంచ పోటీ తత్వానికి దీటుగా వినూత్న సహకార వ్యాపారాలు నమూనాలు చేయడం వంటివి నిర్వహించడం, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు సహకార వ్యవస్థ ద్వారా స్థిరమైన జీవనోపాధి సృష్టించుటకు వారి ఆర్థిక అభివృద్ధికి కీలకంగా వ్యవహరించాలని, సహకార శాఖ అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. జిల్లా సహకార శాఖ అధికారి కె.మురళీకృష్ణ, అసిస్టెంట్ రిజిస్ట్రర్లు ఇ.పూర్ణచంద్రరావు, ఐ.హుస్సేన్, ఎస్.శ్రీనివాసరావు, జి.సత్యనారాయణ, సీనియర్ ఇన్‌స్పెక్టర్ డి.శేషుబాబు ఉన్నారు.

నాగ హారికది హత్య అన్నా వినలేదు

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి వదిలేశారు

దీని వెనక మాజీ మంత్రి కారుమూరి హస్తం ఉంది

మృతురాలు నాగ హారిక అమ్మమ్మ పార్వతి

తణుకు: మండలంలోని ముద్దాపురం గ్రామంలో అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ముళ్లపూడి నాగ హారిక హత్య చేశారని ఎంత మొత్తుకున్నా అప్పట్లో పోలీసులు కనీసం పట్టించుకోలేదని మృతురాలి అమ్మమ్మ గజ్జల పార్వతి వాపోయారు. కేవలం అప్పటి మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఒత్తిడితోనే పోలీసులు కేసును పక్కదోవ పట్టించేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. గురువారం తణుకులో ఎంఎల్ఎ రాధాకృష్ణ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ తన అల్లుడు ముళ్లపూడి శ్రీను, రెండో భార్య ముళ్లపూడి రూపా కలిసి తన మనవరాలిని అత్యంత క్రూరంగా చంపేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం ఆస్తి కోసమే తన మనవరాలిని పొట్టన పెట్టుకున్నారని కన్నీటి పర్యంతమయ్యారు. ముందుగా 2008లో సైతం నాగ హారిక తల్లి, తన కూతురు వసంతను సైతం భర్త ముళ్లపూడి శ్రీను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని చెప్పారు. అయితే నాగ హారికను సవతి తల్లి రూప, భర్త ముళ్లపూడి శ్రీను కలిసి ఆమె తలపై కొట్టి ఆపై పెట్రోల్ పోసి తగలబెట్టారని గుర్తు చేశారు. ఇది హత్య అని తెలిసినప్పటికీ అప్పటి సిఐ ఆంజనేయులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారని అన్నారు. దీని వెనక అప్పటి మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఒత్తిడితోనే పోలీసులు కేసును పక్కదోవ పట్టించేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఫోరెన్సిక్ రిపోర్ట్, పోస్టుమార్టం రిపోర్ట్ కేవలం హత్య అని నిర్ధారించడంతో పోలీసులు నిందితులను అరెస్ట్ చేశారని చెప్పారు. అయితే మూడేళ్ల పాటు తమను మానసిక క్షోభకు గురిచేసిన అప్పటి సిఐ ఆంజనేయులు, కారుమూరి వెంకట నాగేశ్వరరావుపై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

బిటెక్ విద్యార్థి హత్య కేసులో సూత్రధారి కారుమూరి : ఎంఎల్ఎ

ముద్దాపురం గ్రామంలో మూడేళ్ల క్రితం హత్యకు గురైన బిటెక్ విద్యార్థిని ముళ్లపూడి నాగ హారిక కేసును అప్పట్లో మంత్రిగా పనిచేసిన కారుమూరి వెంకట నాగేశ్వరరావు పోలీసులపై చేసిన ఒత్తిడి కారణంగానే పక్కదోవ పట్టించారని తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ ఆరోపించారు. రాజకీయ ప్రలోభాలతో వైసిపి అధికారంలో ఉన్నన్నాళ్లు కేసును బయటకు రానీయకుండా చేశారని విమర్శించారు. మృతురాలు నాగ హారిక సవతి తల్లి ముళ్లపూడి రూప వైసిపి మండల అధ్యక్షురాలిగా పనిచేయడంతో ఈ కేసు అప్పట్లో నీరుగార్చేందుకు ప్రయత్నించారని తెలిపారు. సమగ్రమైన దర్యాప్తు చేసి సూత్రధారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

సత్యనారాయణ ఆశయ సాధనకు కృషి

కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జుత్తిగా నరసింహమూర్తి

పాలకొల్లు రూరల్: రైతు సంఘం నాయకులు కలిదిండియిన సత్యనారాయణ ఆశయ సాధనకు పనిచేయాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జుత్తిగా నరసింహమూర్తి అన్నారు. పూలపల్లి బిల్లు కలెక్టర్‌గా పనిచేసి రిటైర్మెంట్ తరువాత వామపక్ష ఉద్యమానికి ఆకర్షితులై రైతు నాయకులుగా పనిచేశారన్నారు. ఉన్నంత కాలం ఉద్యమాభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. సత్యనారాయణ లేని లోటు ఉద్యమానికి తీరని లోటన్నారు. ఆయన ఆశయాలకు పనిచేయడమే సత్యనారాయణకు నిజమైన నివాళి అని నరసింహమూర్తి అన్నారు. తొలుత సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ జవ్వాది శ్రీనివాస్, యాళ్లబండి నారాయణమూర్తి, యర్రా అజయ్ కుమార్, దొమ్మేటి మీరారావు, చింతపల్లి నరసింహుడు తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

పిల్లల పౌష్టికాహారానికి ప్రాధాన్యత

కాళీపాడు సర్పంచి నాగరాజు

గణపవరం: విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించడానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని కాళీపాడు గ్రామ సర్పంచి తెర్లి నాగరాజు అన్నారు. గురువారం స్థానిక జిల్లాపరిషత్ హైస్కూల్లో జిల్లా రైస్‌మిల్లర్స్ సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యాన భోజన పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ విద్యార్థులకు సన్నబియ్యం వండించడం వల్ల మధ్యాహ్న భోజన పథకంలో భోజనం చేసే విద్యార్థుల సంఖ్య పెరిగిందన్నారు. నాణ్యమైన భోజనం అందించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం వాసపల్ల శ్రీనివాసరావు, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ వెంకట్రావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

డిసెంబర్ 21న పాటల పోటీలు

ఆకివీడు: స్థానిక లలిత కళ సాంస్కృతిక సంస్థ స రి గ మ సంగీత పరిషత్ ఆధ్వర్యాన డిసెంబర్ 21వ తేదీ ఆదివారం ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయిలో తెలుగు సినీ పాటల పోటీలు నిర్వహిస్తున్నట్లు పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షులు సింగవరపు కోటేశ్వరరావు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలోని కళా మండపంలో ఉదయం 11 గంటలకి పోటీలు ప్రారంభమవుతాయని చెప్పారు. పోటీ విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. మొదటి ముగ్గురికి నగదు బహుమతులతో పాటు మరో ఐదుగురికి కన్సోలేషన్ బహుమతులు ఇస్తామన్నారు. ఈ పోటీలు ట్రాక్‌పై నిర్వహిస్తామని, గాయకులు ఎవరి ట్రాక్ వారే తెచ్చుకోవాలని చెప్పారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి

తాడేపల్లిగూడెం : బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తాడేపల్లిగూడెం సబ్ డివిజన్ గవర్నమెంట్ ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు రొక్కాల నాగ బుజ్జి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మాయికి 18, అబ్బాయికి 21 ఏళ్లు నిండిన తర్వాతే వివాహం చేసుకోవాలన్నారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకుని బాగా చదువుకుని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. బాల్య వివాహం జరుగుతున్నట్లుయితే ప్రభుత్వ చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

రాజారావుకు జాతీయ ఉత్తమ ప్రిన్సిపల్ అవార్డు

తాడేపల్లిగూడెం: ఆరుగొలను డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ బి.రాజారావుకు ఇండియన్ టాలెంట్ ఒలింపియాడ్ సంస్థ తరపున జాతీయ ఉత్తమ ప్రిన్సిపల్ అవార్డు లభించినట్లు అవార్డు గ్రహీత ప్రిన్సిపల్ రాజారావు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడం, నాయకత్వ గుణాలు అలవర్చుకునే విధంగా ప్రోత్సహించడం, విద్యా ప్రగతికి మార్గదర్శకత్వం చూపించడం, అలాగే పాఠశాల స్థాయిలో అద్భుతమైన అకడమిక్ ఫలితాలు సాధించడంలో చూపిన విశిష్ట కృషికి ఇండియన్ టాలెంట్ ఒలింపియాడ్ సంస్థ గుర్తించి తనకు ఈ పురస్కారం ప్రదానం చేశారని పేర్కొన్నారు. ఈ అవార్డును ఈనెల 9వ తేదీన మహారాష్ట్రలోని ముంబై నగరంలో ఇండియన్ టాలెంట్ ఒలింపియాడ్ డైరెక్టర్లు ఎం.మధుమతి, ఎం.జగదీశ్ చేతుల మీదుగా అందజేశారని ఆయన పేర్కొన్నారు. ఈ అవార్డు తనకు మరింత సంతోషకరమన్నారు. గురుకుల పాఠశాల విద్యార్థులు, విద్యా ఆరోగ్య ప్రగతి నిరంతరం కృషి చేస్తానని తెలియజేశారు. ఈ అవార్డును ఆదర్శంగా తీసుకుని ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతిలో నూటికి నూరు శాతం ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. అవార్డు అందుకున్న ప్రిన్సిపల్ రాజారావును తోటి ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యా కమిటీ సభ్యులు, సిబ్బంది అభినందించారు.

వైసిపి యూత్ అధ్యక్షులుగా బాలు

ఆచంట: యువతను నిలువునా ముంచిన ఏకైక ప్రభుత్వం కూటమి అని వైసిపి యువజన విభాగం మండల అధ్యక్షులు కోట శేషబాబు (బాలు) అన్నారు. గురువారం కరుగోరుమిల్లిలో వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షులు ముత్యాల అమ్మన్నాయుడు ఆధ్వర్యాన యువజన విభాగం నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి యువజన విభాగం యూత్ అధ్యక్షుడిగా బాలును నియమించారు. అనంతరం కోట శేషబాబు మాట్లాడుతూ మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆదేశాల మేరకు వైసిపి బలోపేతానికి భాగంగా అన్ని గ్రామాల్లో వైసిపి యూత్ గ్రామ కమిటీలు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి పంచాయతీ విభాగం మండల అధ్యక్షులు ముత్యాల నాగేశ్వరరావు, యూత్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ రొక్కాల బన్ను, మండల యూత్ ప్రధాన కార్యదర్శి గోకర్ణ పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కోళ్ల వ్యాన్

నరసాపురం: మండలంలోని లక్ష్మణేశ్వరం పరిసర వారి మెరక పెట్రోల్ బంక్ వద్ద కోళ్ల వ్యాన్ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. స్థానికుల వివరాల ప్రకారం.. గురువారం మధ్యాహ్నం తూర్పుతాళ్లు నుండి నరసాపురం వైపు వెళ్తున్న కోళ్ల వ్యాన్ అదుపు తప్పి 11 కెవి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. వ్యాన్ వేగంగా ఢీకొట్టడంతో విద్యుత్ స్తంభం రెండు ముక్కలైపోయింది. ఆ సమయంలో ఎవరూ రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్‌కు ఏమీ కాలేదు. స్తంభం విరిగిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దాదాపు 6 గంటలు పైగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ నరసాపురం రూరల్ ఎఇ కె.సుధాకర్ ఆధ్వర్యాన దెబ్బతిన్న విద్యుత్ స్తంభం స్థానంలో నూతన స్తంభాన్ని వేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

విద్యార్థులకు పోటీలు

ఆకివీడు : బాలల దినోత్సవం సందర్భంగా ఈనెల 14వ తేదీ శుక్రవారం నుండి స్థానిక జిల్లా శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వహణ కమిటీ సభ్యుడు, ప్రముఖ న్యాయవాది నెల్లి సతీష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల స్థాయి నుండి డిగ్రీ స్థాయి వరకు ఉన్న విద్యార్థులకు ప్రత్యేక ఆట పాటలతో పాటు వివిధ అంశాలలో పోటీలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొని మేధస్సును ప్రదర్శించి, బహుమతులు గెలుచుకోవాలని ఆయన కోరారు.

పాలకోడేరు : ఈనెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా వివిధ ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు పాలకోడేరు గ్రంథాలయ అధికారి జెవి.కృష్ణమూర్తి తెలియజేశారు. ఈమేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వారోత్సవాల సందర్భంగా గ్రంథాలయంలో వివిధ ఆటల పోటీలు నిర్వహించడంతోపాటు విజేతలకు బహుమతులు కూడా అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వారం రోజుల పాటు నిర్వహించబోయే కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని పేర్కొన్నారు.

తుపాను బాధితులకు నిత్యావసరాలు అందజేత

తణుకు: మొంథా తుపాను ప్రభావాన్ని అధికారులు, కూటమి నాయకుల సమన్వయంతో సమర్థవంతంగా ఎదుర్కొన్నామని తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ పేర్కొన్నారు. గురువారం మండలంలోని వేల్పూరు గ్రామంతో పాటు అత్తిలి మండలం శివపురం గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తుపాను బాధితులకు నిత్యావసరాలను అందజేశారు. తణుకు నియోజకవర్గంలో మొత్తం 1250 కుటుంబాలను గుర్తించినట్లు తెలిపారు. అనంతరం మండలంలోని 652 కుటుంబాలకు నిత్యావసరాలను ఎంఎల్ఎ అందజేశారు. కార్యక్రమంలో టిడిపి కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విజయవంతంగా మెగా జాబ్ మేళా

నరసాపురం: శ్రీసూర్య డిగ్రీ కళాశాలలో ఎపి నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ కెరీర్ సర్వీస్ ఆధ్వర్యాన గురువారం జరిగిన మెగా జాబ్ మేళా విజయవంతమైంది. ప్రభుత్వ విప్, నరసాపురం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకర్ మాట్లాడుతూ యువత దేశ సంపద, ఉన్నత లక్ష్యాలు కలిగి ఉన్నప్పుడే దేశాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అందుకు ఆత్మవిశ్వాసాన్ని పెంచుకొని కష్టపడి పనిచేసే మనస్తత్వం కలిగి ఉండాలన్నారు. సుమారు 370 మంది అభ్యర్థులు పాల్గొన్న ఈ మేళాలో ఎంపికైన వారిని తమ సంస్థల్లో నియమించుకున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలియజేశారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి లోకమాన్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సెల్ ఫోన్ల రికవరీ : బాధితులకు పంపిణీ

భీమవరం టౌన్: పదకొండవ విడత సెల్ ఫోన్ల రికవరీ సుమారు రూ.18 లక్షల 90 వేలు విలువగల 126 దొంగిలించబడిన లేదా చేజార్చుకున్న మొబైల్ ఫోన్లను తిరిగి సంబంధిత యజమానులకు జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి గురువారం ఆయన కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విడతల వారీగా ఇప్పటి వరకూ సుమారు రూ.2 కోట్ల 60 లక్షల విలువగల మొత్తం 1738 సెల్ ఫోన్లు రికవరీ చేసినట్లు తెలిపారు. అలాగే ఎవరైనా సెల్ ఫోన్ చోరీకి గురైన, ఎక్కడైనా జారవిడుచుకున్న 9154966503 వాట్సాప్ నంబర్‌కు హాయ్ లేదా హలో అని మెసేజ్ చేసి, వచ్చిన లింక్ ద్వారా ఆన్‌లైన్‌లో మొబైల్ వివరాలు నింపితే సరిపోతుందన్నారు. ఎఎస్‌పి వి.భీమారావు, జిల్లా స్పెషల్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్ కెవివిఎన్.సత్యనారాయణ, పాల్గొన్నారు.

బాలల దినోత్సవం రోజు పరీక్షలు రద్దు చేయాలి : ఎస్ఎఫ్ఐ

ఉండి: బాలల దినోత్సవం నాడు నిర్వహించే పరీక్షలను రద్దు చేయాల్సిందిగా ఉండి మండల విద్యాశాఖ అధికారి బి.జ్యోతికి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా భారతీయ సంఘం అధ్యక్షులు గోవింద్ మాట్లాడుతూ భారత మాజీ ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని ప్రతి ఏడాది బాలల దినోత్సవం అన్ని పాఠశాలలోను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందని, కానీ ప్రభుత్వం బాలల దినోత్సవం జరగకుండా 14వ తేదీన పరీక్షలు నిర్వహించడం సరికాదని అన్నారు.

ముగిసిన ప్రభుత్వ ఉద్యోగుల ఆటల పోటీలు

భీమవరం : భీమవరం డిఎన్ఆర్ కళాశాలలో ఈనెల 11, 12 తేదీల్లో రెండు రోజుల పాటు జరిగిన ప్రభుత్వ సివిల్ సర్వీస్ ఉద్యోగుల ఆటల పోటీలు ముగిసినట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్.మోహన్ దాస్ తెలిపారు. ఈమేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ సివిల్ సర్వీస్ ఉద్యోగుల మహిళలు, పురుషులకు అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్బాల్, క్యారమ్స్, చదరంగం, ఫుట్బాల్, ఖోఖో, బెస్ట్ ఫిజిక్, హాకీ, కబడ్డీ, టెన్నిస్, పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, రెజ్లింగ్, స్విమ్మింగ్, క్రికెట్, యోగా, మ్యూజిక్, డ్యాన్స్, షార్ట్ ప్లే మొత్తం 19 విభాగాల్లో ఆటల పోటీలను నిర్వహించడం జరిగిందన్నారు. ఎక్కువ మంది క్రికెట్, చెస్, టేబుల్ టెన్నిస్, షటిల్, బ్యాడ్మింటన్ ఆటలకు ఆసక్తి చూపి పాల్గొనడం జరిగిందన్నారు. రెండు రోజులు నిర్వహించిన క్రీడా పోటీల్లో పురుషులు, మహిళలు మొత్తం 58 మంది పాల్గొన్నారని తెలిపారు. వీరిలో 44 మంది పురుషులు, పన్నెండు మంది స్త్రీలు వివిధ విభాగాలలో ఎంపిక కావడం జరిగిందన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన వారు ఈనెల 19 నుంచి 22 వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు.

విద్యార్థుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా : జక్కంపూడి

ఉండి: విద్యార్థులకు ఉన్న ప్రతి సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని రాష్ట్ర ఆహార మండలి సభ్యులు జక్కంపూడి కృష్ణకిరణ్ అన్నారు. గురువారం ఉండిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కాపులపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, పెద్దపేటలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, పలు అంగన్వాడీలను ఆయన పరిశీలించగా ఉండి హైస్కూల్లోని విద్యార్థులు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకంపై పలు ఫిర్యాదులు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైస్కూల్లోని విద్యార్థులు నాణ్యమైన ఆహారం అందించట్లేదని అన్నంలో పెంకు పురుగులు వస్తున్నాయని, కోడిగుడ్లు నుంచి దుర్వాసన వస్తుందని, రసం వట్టి నీరుగా ఉంటుందని, బిర్యానీ సుద్దలుగా ఉంటుందని విద్యార్థులు తన దృష్టికి తీసుకువచ్చారని, దీంతో తాము అక్కడి భోజనం తినలేక ఇంటి నుండి క్యారేజీలు తీసుకొస్తున్నామని పలువురు విద్యార్థులు తెలిపారు. వీరి ఫిర్యాదుపై పాఠశాలలోనే భోజనం చేయడం జరిగిందని, వీరి సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరిస్తానని తెలిపారు. దీనిపై హై స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు వై.రామలక్ష్మిని వివరణ కోరగా తమ పాఠశాలకు తాడేపల్లిగూడెంలోని పశ్చిమగోదావరి జిల్లా రైస్ మిల్లర్స్ సాంఘిక సంస్థ నుంచి భోజనాలు వస్తున్నాయని, విద్యార్థులు భోజనం బాగుండట్లేదని ఫిర్యాదు చేయగా ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లినట్లు వారు తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి నారాయణ, విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.సత్యనారాయణ, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఎన్.సరోజ, మండల విద్యాశాఖ అధికారులు బి.జ్యోతి, బి.వినాయకుడు, పౌర సరఫరాల శాఖ మండల ఉప తహశీల్దార్ కె.సూర్యనారాయణ రాజు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

16న ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహావిష్కరణ

పెనుమంట్ర : స్వాతంత్ర విప్లవ వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చేసిన పోరాటం కులం కోసం కాదని, దేశ ప్రజల స్వేచ్ఛ కోసమని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రెడ్డి సంఘం అధ్యక్షులు ద్వారంపూడి వేణు గోపాల కృష్ణారెడ్డి(పెంటపాడు) అన్నారు. గురువారం మండలంలోని మార్టేరు రెడ్డి కల్యాణ మండపం ప్రాంగణంలో జరిగిన ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడుతూ ఈనెల 16 ఆదివారం ఉదయం 11 గంటలకు ఆయన విగ్రహావిష్కరణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా జరిగే సభలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర రోడ్డు-భవనాల శాఖా మంత్రి బిసి జనార్ధన రెడ్డి, రాష్ట్ర రవాణా శాఖా మంత్రి ఎం.రాంప్రసాద్ రెడ్డి, ఆచంట, అనపర్తి ఎంఎల్ఎలు పితాని సత్యనారాయణ, నల్లిమిల్లి రామకృష్ణారెడ్డి పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. అనంతరం కార్తీక వన సమారాధన వేలాది మందికి నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రెస్ మీట్ కార్యక్రమాన్ని ప్రముఖ విద్యాసంస్థల నిర్వాహకులు మేడపాటి విజయా రెడ్డి సంధాన కర్తగా వ్యవహరించారు. రాష్ట్ర రెడ్డి సంఘం ప్రధాన కార్యదర్శి తాడి భీమా రెడ్డి(విశాఖపట్నం), పంచ గ్రామ రెడ్డి సేవా సంఘం అధ్యక్షులు కెకెఆర్.చంద్ర శేఖర్ రెడ్డి(ఆచారి), మూలా గురవమ్మ రెడ్డి ఫౌండేషన్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ మేడపాటి చిరంజీవి రెడ్డి పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామి ఆలయంలో యాత్రికులు

కాళ్ల: కార్తీక మాసం పురస్కరించుకుని సామూహిక శ్రీసత్యనారాయణ స్వామి వారి వ్రతాలు వైభవంగా గురువారం నిర్వహించారు. ఆలయ ఆస్థాన వేద పండితులు అనిపెద్ది ఫణి కుమార్ శర్మ ఆలయ అర్చకులచే సుమారు 1000 మంది యాత్రికులతో వ్రతాలు నిర్వహించారు. యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు, అసౌకర్యం కలగకుండా దేవస్థానం సిబ్బంది, కార్యనిర్వహణాధికారి ఎం.అరుణ్ కుమార్, గ్రామస్తులు, గ్రామ పెద్దలు, మహిళా మండలి సభ్యులు తగు ఏర్పాట్లు చేశారు.

తుది సమరానికి చేరిన టెన్నిస్ పోటీలు

పాలకొల్లు : పాలకొల్లు కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆధ్వర్యాన జరుగుతున్న సిహెచ్.బుద్ధ అవతారం రాజు మెమోరియల్ ఆల్ ఇండియా సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ పోటీలు గురువారం పాలకొల్లు కాస్మో కల్చర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ కోర్టులో సింగిల్స్ డబల్ విభాగాల్లో సెమీ ఫైనల్ మ్యాచ్‌లు హోరాహోరీగా జరిగినట్లు ఆర్గనైజింగ్ సెక్రటరీ గొట్టిముక్కల భగవాన్ రాజు విలేకర్లకు తెలిపారు. గురువారం జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌ల్లో గెలిచిన విజేతలు శుక్రవారం 45, 55, 65, 70 విభాగాలలో ఫైనల్ మ్యాచ్లు ఆడతారని చెప్పారు. అనంతరం బహుమతి ప్రధానోత్సవం ఉంటుందన్నారు.

ఉచిత కంటి శస్త్ర చికిత్సలు

పాలకొల్లు : పాలకొల్లు పట్టణ, పరిసర గ్రామాలకు చెందిన 14 మంది పేద వృద్ధులకు రూ.60 వేలతో వాకర్స్ క్లబ్, పాలకొల్లు ఆధ్వర్యాన గురువారం స్థానిక లయన్స్ కంటి ఆసుపత్రిలో శస్త్ర చికిత్సలు చేయించారు. ఈ సందర్భంగా వారికి క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి షేక్ పీర్ సాహెబ్, ఉపాధ్యక్షుడు మానెం బసవరాజు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో విద్యార్థులు భాగస్వాములవ్వాలి

రిటైర్డ్ జిల్లా విద్యాశాఖాధికారి ప్రసాద్ రాజు

భీమవరం : దేశాభివృద్ధిలో విద్యార్థులు భాగస్వామ్యం కావాలని, ఆవిధంగా చిన్ననాటి నుంచే ప్రణాళిక రూపొందించుకుని ముందుకు సాగాలని రిటైర్డ్ జిల్లా విద్యాశాఖ అధికారి ఇందుకూరి ప్రసాద్ రాజు అన్నారు. మానవత భీమవరం శాఖ, జిల్లా సర్వోదయ మండలి, వసుధ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యాన పిఎంశ్రీ జెఎల్‌బి మున్సిపల్ గర్ల్స్ హై స్కూల్, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు అకాడమిక్ స్థాయిలో అత్యుత్తమ స్థాయి కనబరిచి ఆల్ రౌండ్ పర్ఫార్మెన్స్ చేసిన విద్యార్థులకు బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని మెరిట్ సర్టిఫికెట్లు, జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ రాజు మాట్లాడుతూ విద్యార్థులు మంచిగా చదువుకొని దేశానికి సేవలు అందించాలన్నారు. విద్యాభివృద్ధికి దాతల సహకారం ఎంతో అవసరమని దీనికి అంతా సహకరించాలని కోరారు. భీమవరం రూరల్ సిఐ కాళీచరణ్ మాట్లాడుతూ విద్యావేత్త, మాజీ మంత్రి చింతలపాటి వరప్రసాద్(మూర్తి రాజు) 13వ వర్ధంతిని పురస్కరించుకుని ఇటువంటి మంచి కార్యక్రమాలు జరపడం అభినందనీయమని కొనియాడారు. గర్ల్స్ హైస్కూల్ హెచ్ఎం కె.కృష్ణకుమారి, మానవత భీమవరం శాఖ ఛైర్మన్ బుద్ధరాజు వెంకటపతి రాజు, అధ్యక్షులు సిహెచ్‌వి.రామకృష్ణరాజు, వైస్ ప్రెసిడెంట్ సాగిరాజు సత్యనారాయణ రాజు, ఆత్మీయ సహకారం కన్వీనర్ చాన్ భాషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా మంతెన రామరాజు పుట్టినరోజు

భీమవరం టౌన్‌లో..

కాళ్లలో..

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరం పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు గొలగాని రమేష్ ఆధ్వర్యాన పశ్చిమగోదావరి జిల్లా టిడిపి అధ్యక్షుడు, ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు పుట్టినరోజు వేడుకను స్థానిక శ్రీవెంకటేశ్వర బధిరుల పాఠశాలలో కేక్ కట్ చేసి అనంతరం విద్యార్థులకు విద్యాసామాగ్రి, పళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారధి మాట్లాడుతూ మంతెన రామరాజు క్రమశిక్షణ కలిగిన టిడిపి కార్యకర్తగా, కలవపూడి రూరల్ బ్యాంక్ అధ్యక్షునిగా, డిఎన్ఆర్ కళాశాల ఉపాధ్యక్షునిగా, ఉండి ఎంఎల్ఎగా అనేక పదవులు నిర్వహించి, సామాజిక ప్రజాసేవకు అంకితమైన నిస్వార్థ రాజకీయ నాయకుడన్నారు. ఎఎంసి మాజీ ఛైర్మన్ ఇందుకూరి రామలింగరాజు మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులను చేపట్టాలని ఆకాంక్షించారు. వివిధ కార్పొరేషన్ డైరెక్టర్లు ఉప్పులూరి చంద్రశేఖర్, పామర్తి వెంకటరామయ్య, ఎమ్‌డీ షబీనా, టిడిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి మైలబత్తుల ఐజాక్ బాబు, ఎస్‌సి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యద్దు ఏసుపాదం, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు మాదాసు కనకదుర్గ, ఉపాధ్యక్షురాలు సయ్యద్ నసీమాబేగం, భీమవరం పట్టణ టిడిపి అధ్యక్ష కార్యదర్శులు మద్దుల రాము, చల్లబోయిన గోవింద్, టిడిపి మండల అధ్యక్ష కార్యదర్శులు కొయ్యలగడ్డ గణపతి, కోళ్ల సీతారాం, పట్టణ కార్యదర్శి గంధం రాధ, టిడిపి నాయకులు కొండ్రు శ్రీనివాస్, నీలాతి రమేష్, మాంతి గణపతి, ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు, గూడూరి సుబ్బారావు, చల్లబోయిన సుబ్బారావు, విజ్జురోతు రాఘవులు, పాల శ్రీరామదాసు పాల్గొన్నారు.

కాళ్ల : యువత రాజకీయాల్లో ముందుండాలని ఎపిఐఐసి ఛైర్మన్, మాజీ ఎంఎల్ఎ మంతెన రామరాజు అన్నారు. గురువారం కలవపూడి గ్రామంలో ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు పుట్టినరోజు సందర్భంగా తల్లిదండ్రుల ఆశీస్సులు తీసుకుని వారితో కలిసి కేక్ కట్ చేశారు. తల్లిదండ్రులను సత్కరించి, కేక్ తినిపించారు.

ఉండి : టిడిపి జిల్లా అధ్యక్షులు మంతెన రామరాజు జన్మదిన వేడుకలను మండలంలోని మహదేవ పట్నం గ్రామంలోని సన్‌రైజ్ వృద్ధాశ్రమంలో ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉండి నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు చెన్నం శెట్టి హరి నాయుడు మాట్లాడుతూ అన్ని దానాల్లోకెల్లా అన్నదానం గొప్పదని అన్నారు. మానే నరేంద్ర సూర్య కుమార్, మంగినీటి సీతారాం, ఫణి కుమార్ శర్మ, జి.ప్రసాద్, ఎస్.సాయికృష్ణ పాల్గొన్నారు.

G.T.P. COLLEGE OF EDUCATION FOR WOMEN
(Approved by NCTE & Affiliated to Adikavi Nannaya University)
Dirusumarru Road, BHIMAVARAM - 534 201, W.G. Dt., (A.P.)
Phone No. : 08816-233455 Website: www.gtpcollege.org
ADMISSION INTO B.Ed. SPOT & "B" CATEGOORY SEATS
Applications are invited from the eligible candidates for **B.Ed** course Under Management Quota & Spot admission for the Academic year 2025-2026.
College Status : Non Minority
Intake : 50
COLLEGE VACANCY POSITION :
Spot Left Over Seats : 17 + 5 (EWS)
Category B Seats Under Management Quota : 12
Eligibility : Bachelor Degree or P.G with 50% Marks for OC, and 40% for BC, SC,ST with or without Ed.Cet-2025.
Photo Copies : SSC, Intermediate Marks, Degree or P.G Marks Lists.O.Ds, Study Certificates(10th to Degree) and Caste Certificate, TC should be submitted to the college office by Personally between 10.00 A.M. to 4.00 P.M. on or before 15-11-2025.
Cell : 98482 33933, 98483 81071
MENTEY RAM MANOHAR, B.E.
Secretary & Correspondent

D.N.R. COLLEGE OF EDUCATION
(Approved by NCTE, New Delhi & Affiliated to Adikavi Nannaya University, Rajamahendravaram)
D.N.R. COLLEGE ASSOCIATION, Balusumudi, BHIMAVARAM - 534 202
W.G.Dt., (A.P.) Ph : 08816-223319 / 92486 61329, 99596 82569
B.Ed. Course ADMISSION NOTIFICATION UNDER Category - "A" (Spot Admission) and Category "B" (Management Quota) Seats for the Academic year 2025-2026.
Applications are invited in to B.Ed. Courses under Category "B" (Management Quota) seats and Category. "A" (Spot Admission) Seats are available in our College for the academic year 2025-2026.
College Status : Non-Minority
Intake : 50
COLLEGE VACANCY POSITION :
Category A left over seats (spot) : 12 + 04 (EWS)
Category B seats (Management) : 12
Eligibility : Aggregate percentage of marks in Degree of P.G. is 50% for O.C., 40% for reserved categories with or without Ed.Cet-2025.
Interested candidates can apply on before 15-11-2025.
Photo Copies : SSC, Inter, Degree or P.G. Marks Lists & P.C. or O.Ds, Study Certificates (6th to Degree) and Caste Certificate, should be submitted to the college office in person between 10.00 A.M. to 4.00 P.M. on before 15-11-2025.
* Hostel facility is also available for Men and Women
Dr. J. Shakila, Principal
G. Satyanarayana Raju(Babu), Secretary & Correspondent

UMA EDUCATIONAL & TECHNICAL SOCIETY
B.ED.SE (HEARING IMPAIRMENT), ELURU
(Recognized by RCI, New Delhi, Affiliated by Adikavi Nannaya University)
Parivarthan Spl. School for the Hearing Impaired, Datta Ashram Road, Srinagar 2nd Lane, Sanivarapupeta, ELURU - 534 003.
Ph.No. 08812 - 222295, 94912 20349, 99486 00642
ADMISSION INTO B.ED.SE(HI) "B" CATEGORY & "A" CATEGORY SPOT SEATS
Applications are invited from the eligible candidates for B.Ed. Special Education (HI) Course under Management Quota & Spot Admission for the year 2025 - 26.
College Status : Non-Minority
Intake : 30
College Vacancy Position
Category A Left over Seats (Spot) : 6 + 2 (EWS)
Category B Management Quota : 7
Eligibility : Bachelor Degree or P.G with 50% Marks for OC, 40% Marks for BC, SC, ST with or without Ed.Cet - 2025.
Photo Copies : SSC, Intermediate Marks, Degree or PG Marks Lists, O.D.s, Study Certificates and Caste Certificates, TC should be submitted to the college office by Personally between 10.00 A.M. to 4.00 P.M. on or before 15-11-2025.
- S.P. Reddy, Executive Director and Correspondent

OFFICE OF THE RECOVERY OFFICER-I
DEBTS RECOVERY TRIBUNAL
(MINISTRY OF FINANCE, GOVERNMENT OF INDIA)
Ground & 1st Floor, 31-31-21, Sai Baba Street, Narayan Bhawan, Dabagardens, Visakhapatnam- 530020.

Goverment Of India

FORM No. I.T.C.P 29
(See rule 85 of the Second Schedule to Income-tax Act, 1961)
NOTICE TO LEGAL REPRESENTATIVES
R.P No. 329/2020 in O.A No. 821/2019
Between:

Union Bank of India (e-Andhra Bank), Gudivada Branch, Krishna District. ...Certificate Holder/Applicant
And
Mr. Abburi Krishna Murthy ....Certificate Debtor/Defendant
To,

(CD-2) Mrs. Abburi Nagamani, W/o Late Abburi Krishna Murthy, D.No. 1-51, Badarala Village, Lingapalem Mandal, Eluru District-534452.
(CD-3) Sri. Abburi Rambabu, S/o Late Abburi Krishna Murthy, D No. 1-51, Badarala Village, Lingapalem Mandal, Eluru District-534452.
(CD-5) Sri. Abburi Chandra Sekhara Rao, S/o. Late Abburi Krishna Murthy, D No. 1-51, Badarala Village, Lingapalem Mandal, Eluru District-534452.
(All CDRs 2, 3 & 5 are Legal Representatives of Deceased CDR-1 i.e Late Abburi Krishna Murthy)

Whereas a Recovery Certificate issued in O.A. No. 821/2019 by the Hon'ble Presiding Officer, Debts Recovery Tribunal, Visakhapatnam for Recovery of a sum of **Rs. 83,67,980/-** (Rupees eighty three lakhs sixty seven thousand nine hundred and eighty only) plus interest and other costs from the Certificate Debtors/ Defendants.

And whereas, the said Krishna Murthy (CDR-1) reported died

You are hereby given notice that steps will be taken under all or any of the provisions of the Recovery of Debts Due to Banks and Financial Institutions Act, 1993 read with the Second Schedule to the Income-tax, 1961 to recover the said amount from you together with the interest payable under sub-section (2) of section 220 of the Income-tax, 1961 and the costs, charges and expenses incurred in respect of warrants and other processes issued and all other proceedings taken for realizing the specified amount unless the amount of Rs. 83,67,980/- in respect of Recovery Certificate, together with interest thereon, costs, charges and expenses incurred so far is paid by you within 15 days from the date of service of this notice.

(Given under my hand and the seal of this Tribunal at Visakhapatnam on this day 01st November 2025)

(Avasarala Anil) Recovery Officer
Debts Recovery Tribunal, Visakhapatnam

లింకు దస్తావేజు పోయనవి

ఇందుమూలముగా సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా నా క్లయింట్ మిండ్యాల కొండయ్య గారి భార్య మిండ్యాల వెంకట రమణ గారు వెల్లమిల్లి గ్రామ కాపురస్తులు నా డాక్యుమెంట్ నెం.2543/2014రు గల దస్తావేజును పోగొట్టుకొనియున్నాను. సదరాస్థిని గృహ రుణం కొరకు ముత్తూట్ ఫిన్ కార్ప్ ఫైనాన్స్ కంపెని లిమిటెడ్ తాడేపల్లిగూడెం బ్రాంచ్ నందు రుణం తీసుకోనున్నారు. సదరాస్తికి సంబంధించిన లింకు డాక్యుమెంట్ ఒరిజినల్ దస్తావేజు నెం.3950/2020రు ఈ రిజిస్టర్ కాబడిన లింకు డాక్యుమెంట్ 2543/2014రు ఈ డాక్యుమెంట్ జిరాక్స్ నిమిత్తం వెల్లమిల్లి గ్రామ ఇంటి దగ్గర నుండి తాడేపల్లిగూడెం వచ్చుచుండగా మార్గమధ్యలో పడిపోవడం జరిగినది. ముత్తూట్ ఫిన్ కార్ప్ ఫైనాన్స్ కంపెని లిమిటెడ్ తాడేపల్లిగూడెం బ్రాంచ్ నందు నా క్లైయింట్ రుణాన్ని వినియోగించుకొంటున్నారు .ఒరిజినల్ లింకు డాక్యుమెంట్ పోయిన దృష్ట్యా ప్రత్యామ్నాయంగా విక్రయ దస్తావేజు నెం.3950/2020 రు న్నూ దీనికి సంబంధించిన లింకు డాక్యుమెంట్ 2543/2014 ఒరిజినల్ లింకునూ సదరు బ్రాంచ్‌నకు అవసరమయిన అన్ని డాక్యుమెంట్స్‌తో పాటు డిపాజిట్ చేస్తున్నారు. కావున ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా సదరు ఒరిజినల్ లింకు డాక్యుమెంట్ కనుగొన్న లేదా దొరికిన వారు ఈ దిగువ ఇవ్వబడిన చిరునామాకు లేదా పైన తెలిపిన నా క్లైయింట్ చిరునామాకు తిరిగి ఇవ్వగలరు. ఇంకనూ తెలియచేయునది ఏమనగా ఈ డాక్యుమెంట్ దొరికిన వారెవరైన వినియోగించిన యెడల చట్టవిరుద్ధమగును. మరియు వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకొనబడును. కావున ఈ ప్రకటన జారీ చేయడమైనది.

సం/- కంకట శ్రీనివాస్, అడ్వకేట్, తాడేపల్లిగూడెం
సెల్: 9989524989

ప్రకటన

మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) తాడేపల్లిగూడెం వారి కోర్టులో

H.M.O.P.No.161/2025

బిట్వీన్ :
చింతలపూడి @మేడిది సుజాత ...పిటీషనర్
మరియు
చింతలపూడి జశ్వంత్ @ జశ్వంత్ కుమార్ ...రెస్పాండెంట్
టు :
చింతలపూడి జశ్వంత్ @ జశ్వంత్ కుమార్, S/o.సత్యనారాయణ, పురుషుడు, 32 సం॥లు, డోర్‌నెం.1-50, బిసి కాలనీ, ధర్మాజిగూడెం-534462, ధర్మాజిగూడెం మండలం, ఏలూరు జిల్లా.

పై నంబరు గల విడాకుల కేసులో పైన తెల్పిన గౌరవ కోర్టు వారు మీకు సమన్లు జారి చేసి మిమ్ములను కోర్టుకు హాజరు కావాలని ఆదేశించినప్పటికి సదరు సమన్లు మీకు తీసుకోనందు వలన పైన తెల్పిన గౌరవ కోర్టు వారు ప్రత్యామ్నాయంగా ఈ పేపరు ప్రకటన ద్వారా సమన్లు సర్వీసు చేయమని ఆదేశించి యున్నారు. అందువలన మీకు తెలుపునది ఏమనగా, పై నెంబరు కలిగిన విడాకుల కేసు ది.21-11-2025వ తేదీకి వాయిదా అయివున్నది. ఆ దినమున అనగా ది.21-11-2025వ తేది ఉదయం గం.10.30 ని॥లకు పైన తెలిపిన గౌరవ కోర్టు వారి ముందు తప్పనిసరిగా మీరు గాని మీ తరుపు న్యాయవాది గాని హాజరు కావలెను. లేనియడల మీకు వ్యతిరేకంగా తీర్మానించెదరని యిందుమూలముగా మీకు తెలియపర్చడమైనది.

ధనుకొండ జానకిరామ వెంకటసాయి కుమార్
తాడేపల్లిగూడెం న్యాయవాది, తాడేపల్లిగూడెం.
ది.12-11-2025 సెల్: 8008502652.

IN THE COURT OF THE CIVIL JUDGE (SENIOR DIVISION), TADEPALLIGUDEM,

I.P.No.11/2023

Between:
Chinta Nagaraju ...Petitioner
And
1. Gudapati Narsihamurthy @ Narasayya and others ...Respondents.
To,
4th Respondent:
Gangireddy Kiran Kumar, S/o Prem Kumar, Door No.4-26-4, Near Rocket Park, DS Cheruvu Center, Tadepalligudem, West Godavari District, TPG SCJ.
20th Respondent:
Mulagala Nata Raju, S/o Not known, Door No.2-32-14, Near school, Nalla Krishna Murthy colony, Tanuku, West Godavari District, TNK SCJ.

NOTICE

Please take notice in the above Debtor Insolvency Petition filed by the petitioner against the Respondents No.1 to No.32 and the Honourable court issued notices to the Respondents No.4 and No.20 for number of times, but you are avoiding to take notices in the above Debtor Insolvency Petition. So, the Honourable court ordered the notices by way of publication to you through the Prajasakthi Daily News paper. So, you are here by directed to appear before the Honourable court at 10-30 A.M on 18-11-2025 to which date the above I.P stands posted, either in person or through an advocate and to file your counters if any regarding the objections for passing the orders, If you are failed to appear before the Honourable court at 10-30 A.M on 18-11-2025 the I.P will be decided in your absence.

(By order of the court)

T.Murali Krishna,
Advocate for Petitioner,
Tadepalligudem.

వేలం ప్రకటన

మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

E.P.No.47/2024 in O.S.No.3/2012

Between:
అంబటి వీరవెంకట సత్యనారాయణ ...పిటీషనరు/డిక్రీ హోల్డర్
And
గోనిపాటి సుగుణరావు ...రెస్పాండెంటు/జడ్జిమెంట్ డెబ్టర్
To.
గోనిపాటి సుగుణరావు, తండ్రి క్రిష్ణ మూర్తి, వయస్సు 45 సం॥లు, పురుషుడు, వ్యాపారం, యలమంచిలి, యలమంచిలి మండలం.

పై నెంబరు వారంటు అమలు గ్రంథములో జడ్జిమెంట్ డేటర్ యొక్క ఈ దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్తిని ది.**27.11.2025**వ తేదీన ఉ.గం.10.30 ని॥ల లగాయితు పైన తెలిపిన కోర్టు నందు వేలం ద్వారా విక్రయించబడును. కావున కావలసినవారు వేలంలో పాల్గొని క్రియం పొందగలరు.

షెడ్యూలు

పశ్చిమ గోదావరి జిల్లా, పాలకొల్లు సబ్ రిజిస్ట్రార్ పరిధిలో గల యలమంచిలి మండలం, యలమంచిలి గ్రామ పరిధిలో గల జిరాయితి పల్లం భూమి ఆర్.సి.నెం.360/14లో య.0-21 సెంట్లు భూమికి హద్దులు :
తూర్పు : గోనిపాటి క్రిష్ణమూర్తి గారి భూమి
పడమర : వడ్డీ రామమూర్తి వగైరాల భూమి
దక్షిణం: వడ్లపాటి వెంకటరావు గారి భూమి
ఉత్తరం: గోనిపాటి క్రిష్ణమూర్తి గారి భూమి
యావత్తు ఈజిమెంట్ హక్కులతో సహా..
డిక్రీ హోల్డర్ విలువ : Rs.1,19,700/-
అమినా విలువ : Rs.1,50,000/-
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

బీరా నరసింహమూర్తి
గొల్లమండల సత్యనారాయణ,
నరసాపురం న్యాయవాదులు, పాలకొల్లు,
తేది.12-11-2025 పశ్చిమ గోదావరి జిల్లా.